భారీ వాహనాల రాకతో రహదారులకు భద్రత కరువు

భారీ వాహనాలను పురవీధులలో ప్రయాణించకుండా నియంత్రించాలని కోరుతున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-చింతపల్లి : గ్రామంలోని పురవీధులలో సైతం భారీ వాహనాలు తిరుగుతుండడంతో రహదారులకు భద్రత కరువైంది. రామాలయం వీధిలో సిమెంటు లోడుతో వస్తున్న భారీ లారీల వలన రహదారి దెబ్బతింటుంది. ఇప్పటికే రామాలయం వీధిలోని సకల దేవతల ఆలయ సమీపంలో రహదారి మధ్యలో కల్వర్టు వద్ద రంధ్రం ఏర్పడి వాహనాల రాకపోకల సమయంలోనే గాక, సాధారణంగాను ప్రయాణికులు, పాదాచారులకు ఆ రంధ్రం వలన తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు స్థానిక మసీదు సమీపంలో సిమెంటు లోడుతో వచ్చిన లారీ కారణంగా కుంగిన రహదారి వలన లారీ కాలువలోకి ఒరిగి పోయింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు రాకపోకలు సాగించే పాదాచారులు సైతం తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గ్రామంలోని ప్రధాన రహదారులే అంతంత మాత్రంగా ఉంటే పురవీధులలో భారీ వాహనాలు తిరగడం రహదారుల భద్రతకు పెనుముప్పుగా పరిణమిస్తుందని, కనుక భారీ వాహనాలను పురవీధులలోకి రావడానికి నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుకాణాలు 6... దరఖాస్తులు 139

- కొయ్యూరు మండలానికి సంబంధించిన రికార్డు స్థాయిలో దరఖాస్తులు
- ధరావతు సొమ్ముగా రెండు కోట్ల 78 లక్షల రూపాయల వసూలు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కూర్మారావు

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చింతపల్లి, జికే విధి, కొయ్యూరు మండలాలకు సంబంధించి ఆరు మద్యం దుకాణాలకు గాను 139 దరఖాస్తులు వచ్చాయని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కూర్మారావు అన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఆరు మద్యం షాపులకు గాను గడువు ముగిసే సమయానికి 139 దరఖాస్తులు వచ్చాయన్నారు. చింతపల్లి మండలానికి మూడు షాపులకు 68 దరఖాస్తులు రాగా, గూడెంకొత్తవీధి మండలానికి సంబంధించి రెండు షాపులకు 25, కొయ్యూరు మండలానికి సంబంధించి ఒక దుకాణానికి గాను రికార్డు స్థాయిలో 46 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ విధంగా మొత్తం 139 దరఖాస్తులకు

గాను దరావతుగా రెండు కోట్ల డెబ్బై ఎనిమిది (రూ.2,78,00,000) లక్షల వచ్చిందన్నారు. 14 వ తారీకు ఉదయం ఏడు గంటల నుండి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ విధానం ద్వారా లైసెన్స్‌లు ఖరారు చేయడం జరుగు తుందన్నారు.

లాటరీ విధానం ద్వారా లైసెన్స్‌లు దక్కించుకున్న వ్యాపారులు మరుసటి రోజు (16వ తేదీ) నుండి నూతనంగా మద్యం దుకాణాలను యధావిధిగా నిర్వహించుకోవచ్చు నని ఆయన తెలిపారు.

వంజంగి పర్యటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

పర్యాటక ప్రాంత ప్రారంభ కార్యక్రమంలో కిల్లు వెంకట రమేష్‌నాయుడు

విశాలాంధ్ర-పాడేరు : శీతాకాలం ప్రారంభంలోనే ఆంధ్ర ఊటీగా పేరుగాంచి నటువంటి అరకు పాడేరు చింతపల్లి ప్రాంతాలల్లో పర్యాటకుల సందడితో గిరిజన ప్రాంతానికి కొత్త సోయగాలతో పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. అటు కార్తీక మాసం పురస్కరించుకొని ప్రజలు వేలాది సంఖ్యలో వన భోజన కార్యక్రమాలు ఇటు పర్యాటకుల ఆనంద విహారా యాత్రాలతో ముఖ్య పర్యటక ప్రాంతాలైనటువంటి ఆంధ్ర ఊటీ అరకు, పాడేరు, చింతపల్లి ప్రాంతాలు పర్యాటకులతో ఆహ్లాదకర వాతావరణం నెలకొనే పరిస్థితి ఉంది. ఇటువంటి సందర్భాల్లో స్థానికంగా మరుగున పడినటువంటి అనేక పర్యటక ప్రాంతాలు అభివృద్ధి

చెందినటువంటి పర్యాటక ప్రాంతాలను పర్యాటకులకు అందుబాటులో తేవాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వంలో పర్యాటక శాఖలో సభ్యుడుగా ఎన్నుకోబడి నటువంటి కిల్లు వెంకట రమేష్ నాయుడు స్థానిక పర్యటకాన్ని మరింత అభివృద్ధి చేయాలని లక్ష్యంతో పాడేరు మండలం వంజంగి పర్యటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం స్థానిక గిరిజనులకు మరింత ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడం కోసం స్థానిక ప్రజలతో చర్చించి పర్యాటక ప్రాంతంలో వస్తున్న పర్యటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించా లని లక్ష్యంతో నూతన పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅరకు పాడేరు చింతాపల్లి ప్రాంతాలల్లో పర్యాటకం మరింత అభివృద్ధి చెందాలని స్థానికులకు దక్కాలని ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి తెదేపా జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పల్లె పండుగ : కలెక్టర్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అక్టోబర్ 14 సోమవారం నుంచి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఆగస్ట్ 23వ తేదీ ఒకేరోజు జిల్లాలోని 430 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులను ప్రారంభించేందుకు, పల్లె పండుగ పేరుతో కొత్త కార్యక్రమం ప్రారంభం కానుందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా చేపడతామని కలెక్టర్ తెలిపారు. సుమారు 413 కోట్ల

రూపాయలతో 900 పైగా వివిధ రకాల పనులను ప్రతిపాదించడం జరిగిందన్నారు. సోమవారం నుంచి ఆగస్ట్ 23వ తేదీన పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆమోదించిన పనులు ప్రారంభించాలని సూచించారు. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో గ్రామసభల్లో తీసుకున్న అర్జీలు పరిష్కారం, తీర్మానాల అమలుచేయాలన్నారు. పల్లె పండుగలో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన భూమి పూజ కార్యక్రమాలు చేయాలని సూచించారు. పల్లె పండుగలో సీసీ రోడ్లు, తారు రోడ్లు, వ్యవసాయ కుంటలు, పశువుల శాలలు, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా సిటిజన్ నాలెడ్జ్ బోర్డులు అందరికీ తెలిసేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం 138 గ్రామ పంచాయతీలలో రూ.12.4 కోట్లతో చేపట్టనున్న 211 పనులకు శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ 211 పనులలో 28 సీసీ రోడ్లకు 3.98 కోట్లు, మూడు బీటీ రోడ్లకు 1.63 కోట్లు, నాలుగు డబ్ల్యూబిఎం రోడ్డులకు 5.05 కోట్లు, 4 సీసీ డ్రైన్లకు 0.17 కోట్లు, 66 పెరక్యులేషన్ ట్యాంకులకు రూ.5.51 కోట్లు, ఏడు ఫిష్ పాండ్లకు 3.50 కోట్లు, 35 కమ్యూనిటీ సోక్ ఫిట్స్‌కు 13 లక్షలు, 64 రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పథకాలకు 47 లక్షలతో పనులు ప్రారంభం కానున్నాయని కలెక్టర్ వివరించారు.

నిరుపేదలకు అన్నదానం చేయడం సంతృప్తికరం

లమ్మసింగి పంచాయతీ చీకటి మామిడిలో సాన్ చారిటీ అన్నదానం

పర్యాటకశాఖ మేనేజర్ సాన్ చారిటీ ఫౌండర్ అప్పలనాయుడు

విశాలాంధ్ర-చింతపల్లి : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిరుపేదలకు అన్నదానం చేయడం సంతృప్తికరంగా ఉందని పర్యాటక శాఖ మేనేజర్, సాన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లమ్మసింగి పంచాయతీ చీకటిమామిడి గ్రామంలో సుమారు 300 వందల మంది పివిటిజి తెగకు చెందిన గిరిజనులకు అన్నదానం చేశారు. భవిష్యతులో గిరిజన ఏజెన్సీ-మైదాన ప్రాంతాలలో సాన్ చారిటీ ద్వారా దాతలు సహకారంతో మరెన్నో కార్యక్రమాలు చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లమ్మసింగి మాజీ సర్పంచ్ రఘునాథ్, గ్రామపెద్ద రావుల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి చేరికలు

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం కే.ఎర్రగొండ పంచాయితీ చందుర్తి గ్రామం ప్రజలు పలువురు జనసేన పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజుల పాలనలో పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ఎంతో ఆర్చర్యం కలిగిందని ఇంతకు ముందు చందుర్తి గ్రామ

ప్రజలందరూ అనేక రకాల సమస్యలతో ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయని, గత ప్రభుత్వంలో నాయకులకు సంబంధిత అధికారులకు తెలియజేసినా స్వరైన సరైన స్పందన లేదని అన్నారు. ఇకనైనా మా పరిస్థితులు మారుతాయని గ్రామాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్లాలని జనసేనలో చేరినట్టు చెప్పారు. గత ఐదు సంవత్సరాలలో ఏం చేసారో అందరికి తెలిసిందేనని ఒక నిబద్ధత కలిగిన నాయకుడు వెనక నడవటానికి గ్రామంలో యువత నిర్ణయం తీసుకుందని రంప.చోడవరం నియోజవర్గం జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కుర్ల రాజశేఖర్ రెడ్డి ఈసందర్భంగా అన్నారు. పార్టీలో చేరిన వారిని జనసేన పార్టీ లోకి కండువాలు కప్పి ఆహ్వానించారు. వై.రామవరం మండల జనసేన పార్టీ నాయకులు ఆర్.పుష్పరాజ్ ఆధ్వర్యంలో ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడ్డతీగల మండలం జనసేన పార్టీ నాయకులు కుప్పాల జయరాం, పొడుగు సాయి, బాబి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పర్యాటక ప్రాంతాల సందర్శనకు అనుమతి లేదు

విశాలాంధ్ర-రంపచోడవరం: సోమవారం నుండి ఈనెల 17వ తారీకు వరకు వర్షాల కారణంగా పర్యాటక ప్రాంతాలను పర్యాటకులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించడం జరగదని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఈనెల 14 వ తారీకు నుండి ఈనెల 17వ తారీకు వరకు తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏజెన్సీలోని పర్యటక ప్రాంతాలలో ఎవరిని అనుమతించడం జరిగిందని ఆయన తెలిపారు. తుపాను, భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు ఎక్కడికి అక్కడ అధికారులను సిబ్బందిని నియమించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలకు కొండ కాలువలు ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉన్నందున కాలువలు దాటవద్దని ఆయన తెలిపారు. భారీ వర్షాలు కారణంగా ఏజెన్సీలోని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ ప్రజలను ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ వేరువేరుగా కోరారు.

నేటి నుండి పల్లె పండగ

ఎంపీడీవో ఆశాజ్యోతి

విశాలాంధ్ర-చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పల్లె పండగ కార్యక్రమం నేటి నుంచి 19వ తారీకు వరకు ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించబడునని స్థానిక ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్మాత్మికంగా నిర్వహించ తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొని మండలంలోని 17 పంచాయతీల పరిధిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు.

08

పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ రక్షణకు కలసి కృషి చేద్దాం

- ఘనంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమం
- ఎంపీడీవో ఆశాజ్యోతి

విశాలాంధ్ర-చింతపల్లి : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత పర్యావరణ రక్షణకు కలిసి కృషి చేద్దామని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రజాప్రతినిధులు, పారిశు ధ్య కార్మికులు, వివిధ పార్టీల నాయకులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కాంప్లెక్స్ పరిసరాలలో ఉన్న చెత్తను తొలగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అదే క్రమంలో పర్యావరణ పరిరక్షణకు సమిష్టి కృషి అవసర మన్నారు. పరిసరాలలో ప్లాస్టిక్, తదితర వ్యర్థాలు వేయడం వలన క్రిములు వృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. వాటివలన వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. అటువంటి వాటిని నియంత్రించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత బాధ్యతతో మెలగాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పుష్పలత, ధార లక్ష్మీ, జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని 52 మద్యం షాపులకు నేడు డ్రా

- 1393 దరఖాస్తులద్వారా 27.86 కోట్ల ఆదాయంరాక
- రిటైల్ ఎక్సేంజ్ టాక్స్ గా మరో 31.40 కోట్లఆదాయం
- మండలం యూనిట్ గా షాపులు కేటాయింపు
- జిల్లా కలెక్టర్ సమక్షంలో 'డ్రా'
- ఈనెల 16 నుండి కొత్త మద్యం షాపులు

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మన్యంజిల్లాలోని 52మద్యం షాపులకు సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు బైపాస్ రోడ్డులో ఉన్న ఎం.ఏ.నాయుడు ఫంక్షన్ హాల్‌లో

కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ సమక్షంలో డ్రా తీసే కార్యక్రమం జరుగుతుందని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ పి. రామచంద్రరావు తెలిపారు. ఆదివారం నాడు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేసి మద్యం షాపుల డ్రాపై అన్ని అంశాలను వివరించారు. ఈ నెల ఒకటి నుంచి 11 వరకు జిల్లాలోని ఐదు ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా నిర్వహించడం జరిగిందన్నారు. 52 మద్యం షాపులకుగాను 1393 దరఖాస్తులు వచ్చాయని, దీని ద్వారా నాన్ రిఫండబుల్ క్రింద ప్రభుత్వానికి 27 కోట్ల 86 లక్షల రూపాయలు ఆదాయం వచ్చిందన్నారు. నేడు మద్యం షాపుల రా తరువాత రిటైల్ ఎక్సేంజ్ టాక్స్ ద్వారా ఈ షాపుల నుండి రూ. 31 కోట్ల 40 లక్షల రావడం జరుగుతుందన్నారు. మండల యూనిట్‌గా షాపులు కేటాయింపు జరిగిందన్నారు. కలెక్టర్ సమక్షంలో పారదర్శకంగా డ్రా జరుగుతుందని, ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో బలిజిపేట మండలం నుండి షాపులతో డ్రా తీసివేసే కార్యక్రమం ప్రారంభమై, వీరఘట్టం మండలంలోని షాపులతో ముగుస్తుందన్నారు. ఇప్పటికే డ్రాలో పాల్గొనేందుకు సంబంధించి టోకెన్లు కూడా జారీచేశామన్నారు. ఒక్కో షాపుకు ముగ్గురిని ఎంపిక చేయడం జరుగుతుందని, మొదటి వారు 24 గంటల్లో డబ్బులు చెల్లించకపోతే రెండవ వారికి, రెండవ వారు 24 గంటల్లో డబ్బులు చెల్లించకపోతే మూడో వారికి షాపును కేటాయించడం జరుగు తుందన్నారు. జిల్లాలోని అత్యధికంగా వీరఘట్టం మండలంలో రెండుషాపులకు 130 దరఖాస్తులురాగా, అతితక్కువ సీతంపేట మండలంలోని రెండు షాపులకు 34 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని గుమ్మలక్ష్మిపురం, సీతంపేట మండలాల్లో మద్యం షాపులను స్థానిక గిరిజనులకు ప్రాధాన్యతకల్పించడం జరుగుతుందని, అక్కడ గిరిజనులు లేనిపక్షంలో స్థానికేతర గిరిజనులకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని భామిని మండలంలో ఒకేషాపు ఉందన్నారు.రూల్ 24 ప్రకారము మద్యంషాపుల ఏర్పాటుకు గతంలో ఉండే నియమి నిబంధనలన్నీ వర్తిస్తాయన్నారు. డ్రాలో ఎంపికైనవారు మొదటవిడతగా చెల్లించాల్సిన డబ్బులు చెల్లించిన వెంటనే వారికి షాపులకు సంబంధించి ప్రొవిజనల్ అనుమతి ఉత్తర్వులు అందజేయడం జరుగుతుందన్నారు. డ్రాలో షాపులు దక్కించుకున్నవారు ఈనెల 16 నుండి షాపులను ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం షాపులలో ఉన్న స్టాక్ మిగిలిన సమక్షంలో నెల్లిమర్ల డిపోకు పంపించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న షాపులఉద్యోగులకు ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడం, ప్రైవేట్ కంపెనీలోను అవకాశాలు కల్పించడం, ఎక్కడైనా అవుట్సోర్సింగ్ ఖాళీలు ఉంటే అక్కడ అవకాశం కల్పించడం, లేదంటే మార్కెటింగ్‌లో అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. నేడు డ్రా కార్యక్రమంలో పెద్దఎత్తున మద్యం దరఖాస్తుదారులు పాల్గొంటున్నందున ట్రాఫిక్, ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగుచర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా ఎస్పీని కోరడం జరిగిందన్నారు. లాటరీలో ఫైనల్ అథారిటీ జిల్లా కలెక్టర్ దేనని తెలిపారు. ఈవిలేకరులసమావేశంలో ఆయనతోపాటు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్, పార్వతీపురం సర్కిల్ సిఐ కె.సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణకు ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-బెలగాం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ అమరావతి వారి ఉత్తర్వుల మేరకు, రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులములు మరియు షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులకు డి.ఎస్.సి పరీక్ష కొరకు ఉచిత భోజన మరియు వసతి సౌకర్యములతో కూడిన మూడు నెలల పాటు శిక్షణ పొందుటకు https://mdfc.apcfss.in మరియు http://jnanabhumi.ap.gov.in ఆన్లైన్ పోర్టల్స్‌లో ఏదో ఒక దానిలో అభ్యర్థులు దరఖాస్తు నమోదు చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎం.డి గయాజుద్దీన్ తెలిపారు. దరఖాస్తు నమోదు చేసుకొనుటకు పైన తెలిపిన ఆన్లైన్ పోర్టల్స్ లో ఈనెల 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు అవకాశం కల్పించడమైనదని, ఎస్.జి.టిలకు ఇంటర్మీడియట్ తో పాటు డైట్ సెట్ మరియు టెట్, స్కూల్ అసిస్టెంట్స్ కు డిగ్రీ, బిఈడి మరియు టెట్ విద్యార్హతలు కలిగినవారు అర్హులని, అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2,50,000/- ల లోపు కలిగిన విద్యార్థులు అందరూ అర్హులని, ఆన్లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడునని తెలిపారు. కావున ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని, మీ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకొనుటకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలసినదిగా కోరారు.

సుమిత్రాపురంలో పల్లె పండుగ వారోత్సవాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-సీతానగరం : ఎన్ డి ఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున కల్పించేందుకు నేటి నుంచి వారంరోజులపాటు పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించడానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా మండలంలోని సుమిత్రాపురం గ్రామంనుండి వల్లరగుడబ గ్రామం వరకు బిటిరోడ్డు నిర్మాణానికి నేడు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శంకుస్థాపనచేయనున్నారని ఎంపిడిఓ పాండ్రంకి త్రివిక్రమరావు తెలిపారు. మండలంలోని ఈరోడ్డుతో పాటు నిడగల్లు-జగన్నాధపురం, గెడ్డలుప్పి-కొత్తవలస గ్రామాలకు చెందిన భేటీ రోడ్డులు మంజూరయ్యాయి. ఈ మూడు రోడ్లు నిర్మిస్తే మండలంలో అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు ఉన్నట్లే అని చెప్పవచ్చు. ఇది ఎలా ఉండగా నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు హాజరు కావాలని మండలపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రోడ్డు వేణుగోపాల నాయుడులు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో సిసిరోడ్లు, బిటి రోడ్లు, నీటి సంరక్షణ ట్రెంచులు, గోకులాలను గ్రామాల్లో పెద్దఎత్తున నిర్మించడం జరుగుతుందన్నారు. ఎంజిఎన్ఆర్ఈజి ఎస్ నిధులతో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు.

బాధిత కుటుంబాలను జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు పరామర్శ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని తాల్లడుమ్మ, రావాడ గ్రామంలో ఈమధ్యకాలంలో అనారోగ్యంతో మరణించిన కార్యకర్తల కుటుంబాలను పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు పరామర్శ చేసి ఓదార్చారు. ఆయనతోపాటు పలువురు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు. అదేవిదంగా తుంబలిలో నిన్న మరణించిన కార్యకర్తల కుటుంబాన్ని మాజీమంత్రి పాముల పుష్పశ్రీవాణి పరామర్శించారు. ఆమెతో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-సీతానగరం : ఈనెల 17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో పి త్రివిక్రమరావు తెలిపారు. ఎంపీపీ బలగ రవణమ్మ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బోనల విజయ్ చంద్ర హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమా వేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేటి నుండి పంచాయతీ వారోత్సవాలు

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంచాయతీ వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు సీతంపేట మండలంలో అన్ని పంచా యతీల్లో నిర్వహించ బడునని ఈ వారోత్సవాలు ద్వారా ఉపాధి నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహించబడునని సిమెంట్ రహ దారులు, కాలువలు నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుంది అని పంచాయతీ సర్పంచులు, మండల పరిషత్ అధికారులు ఈ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమరక పవన్ తెలిపారు.

ఘనంగా ముగిసిన దేవీ శరన్నవరాత్రులు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని గత తొమ్మిదిరోజులుగా వాడవాడలా నిర్వహిస్తున్న దేవిశరన్నవరాత్రుల వేడుకలు శనివారంతో ముగిసాయి. విజయదశమి పురస్కరించుకొని శనివారం నాడు అన్నిగ్రామాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలుచేసి వాహనాలకు పూజలు చేశారు. దుర్గాదేవికి పూజలుచేసి మంచి జరగాలని వారంతా ఆకాంక్షించారు. అన్ని గ్రామాల్లో గత తొమ్మిది రోజులుగా దుర్గాదేవి విగ్రహాల వద్ద భవాని మాటలు స్వాములు పెద్ద ఎత్తున మాలలు ధరించి దీక్షల చేపట్టి పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి అన్ని గ్రామాల్లో దుర్గ దేవి విగ్రహాలను అనుపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుగ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలతో, డిజేలతో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా విజయదశమి పండగ శనివారం పడడంతో శనివారం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆదివారం కోళ్లు, గొర్రెలు, మేకలు వేసుకుని విందు, మందు పండగను చేసుకోవడం అన్ని గ్రామాల్లో కనిపించింది.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధపూజ

విశాలాంధ్ర-పార్వతీపురం : విజయాలకు చిహ్నామైన విజయదశమి అందరికీ అన్ని రంగాల్లో విజయం చేకూర్చాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీఎస్ వి మాధవ రెడ్డి తెలిపారు. శనివారం నాడు విజయదశమి పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు అన్ని విషయాలలో విజయవంతంగా ముందుకు సాగుతూ జిల్లా పోలీస్ శాఖ పేరు ప్రతిష్టలు పెంచాలని తెలియజేస్తూ, జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు పోలీస్ శాఖ తరపున విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ అధికారులకు పోలీస్ సిబ్బందికి కూడా విజయదశమి శు భాకాంక్షలు తెలిపారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీస్ కార్యాలయంలో దుర్గామాత ఆశీస్సులకై పోలీసు ఆయుధాలు, వాహనాలకు నిర్వహించిన ఆయుధపూజ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేసారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణగా చెడుపై సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సమయంలో ఆనవాయితీగా చేయు ఆయుధపూజను జిల్లా ఎస్పీ మేలతాళాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా, భక్తి శ్రద్ధలతో, నిష్టతో ఘనంగా నిర్వహించారు. ఈపూజలో పోలీస్ సిబ్బంది రోజువారీ చర్యల్లో ఉపయోగించే పలురకాల ఆయుధాలతో పాటు మోటారు ట్రాన్సుపోర్ట్ విభాగంలోని వివిధ రకాల పోలీసు వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయుధ పూజ అనేది పోలీసులు, భద్రతా దళాలకు అత్యంత ముఖ్యమైన పండగని, పోలీసులు దుష్ట శిక్షణ శిష్ట రక్షణకు కట్టుబడి ఉండాలని, శాంతిభద్రతల

పరిరక్షణలో రాజీ లేకుండా వ్యవహరించాలని, ఈపండుగ అందరికీ కొత్త విజయాలు చేకూర్చాలని, చేపట్టిన ప్రతీ కార్యం సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు దేవి అమ్మవారి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని, అన్ని వర్గాలవారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని అన్ని విషయాలలో విజయవంతంగా ముందుకు సాగుతూ జిల్లా పోలీస్ శాఖ మంచి పేరు ప్రతిష్టలు సాధించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈపూజా కార్యక్రమంలో అదనపు ఎస్పీడా., ఓ.దిలీప్ కిరణ్, ఆర్ ఐ శ్రీరాములు,టి.శ్రీనివాసరావు, శ్రీనివాస రావు ,ఆర్ఎస్ ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో విజయదశమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో వాహనాలకు పెద్ద ఎత్తున పూజలు చేసి దుర్గామాత ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

వైభవంగా దుర్గమ్మ ఊరేగింపు

విశాలాంధ్ర-ఎటపాక : ఎటపాక మండలం చోడవరం ఎస్సి కాలనీలోగత 39 సంత్సవరాలుగా దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆలయాల వద్ద గ్రామస్తులు 10 రోజుల క్రితం దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వివిధ అలంకరణల్లో ప్రత్యేక పూజలు చేశారు. దశమి పూర్తయిన రెండోరోజు ఆదివారం రాత్రి ప్రత్యేక వాహనంలో పూలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అందరిచూపులు నేటి మద్యం 'డ్రా' వైపే

- అదృష్టం కోసం ఎదురుచూస్తున్న మద్యం దరఖాస్తుదారులు
- షాపు వస్తే లక్కీ... రాకపోతే అప్పుల పాలు కావడం ఖాయం

విశాలాంధ్ర-పార్వతీపురం : తెలుగుదేశం ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 కొత్తమద్యం విధానం అమలులో భాగంగా నేడు(సోమవారం) అత్యంత కీలకమైన రోజని చెప్పవచ్చు. ఈనెల 1 నుండి 11 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరగగా, నేడు పార్వతీపురం మన్యం జిల్లాలోని, విజయనగరంజిల్లాలో మద్యం షాపులకు డ్రా తీసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ల సమక్షంలో "డ్రా"తీసేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పార్వతీపురం మన్యంజిల్లాలోని ఎం.వి. నాయుడు ఫంక్షన్ హాల్ లోను, విజయనగరం జిల్లాలో జిల్లా కలెక్టరేట్ హాల్లో డ్రా తీయడం జరుగుతుందని రెండు జిల్లాల అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఫలితాలకంటే నేటి డ్రా ఫలితాలుపైన అందరి చూపులు ఉన్నాయి. రెండు జిల్లాల్లో అందరికీ సత్సంబంధాలు ఉండడంవలన అక్కడ వారు ఇక్కడ, ఇక్కడవారు అక్కడ షాపులకు పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకోవడం జరిగింది. సామాన్య వ్యక్తి నుండి బడావ్యక్తులవరకు ఎన్నడులేని విధంగా ఈదపా

మద్యం షాపులకు దరఖాస్తు చేయడం గమనార్హం. ఎంతోమంది సిండికేట్లుగా ఏర్పడి లక్షలాది రూపాయలను పోగుచేసి మద్యం షాపులకు దరఖాస్తుచేసుకున్నారు. నేడు వారంతా తమఅదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఆదివారంనాడు దసరా పండుగ అయినప్పటికీ దసరా ఆనందం కంటే మద్యంషాపుల డ్రాగూర్చే ఎక్కడికక్కడ చర్చలు, సమావేశాలు జరగడం గమనార్హం. గతంలో పెద్దపెద్ద స్థాయిలో ఉండేవారే మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోగా, నేడు అన్నివర్గాలవారు ముఖ్యముగా రాజకీయాలుచేసే చోటా నుండి బడానాయకులు మద్యం షాపులువైపు ఆసక్తిచూపించడం గమనార్హం. అధికార ప్రతిపక్షాలకు చెందిన నాయకులంతా మద్యం షాపులకు దరఖాస్తులు వేయడం బహిర్గతమే. పార్వతీపురం మన్యం జిల్లాలోని 52 షాపులు ఎవరికివరిస్తాయో తెలియదుగానీ అందరూ పార్వతీపురం వెళ్లడానికి అన్నిఏర్పాట్లు చేసుకున్నారు. ఇదే సమయంలో విజయనగరం జిల్లాలోని 152 షాపులకు కూడా పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని మండలాల్లో నేతలు, బడావ్యాపారులు దరఖాస్తు చేయడంతో అక్కడకు కూడా వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆదివారం రాత్రి చాలామంది పార్వతీపురం విజయనగరం చేరుకుని హొటల్లో వర్ష చేస్తున్నారు. ఏదేమైనా 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకంటే నేటి మద్యం షాపుల డ్రా ఫలితాలపై అందరూ చూపులు ఉన్నాయని, ఎన్నోఆశలతో ఎదురుచూస్తున్నామని పలువురు తెలిపారు. ఆదివారంనాడు పలువురు సిండికేట్లుగా ఏర్పడినవారు దీనిపై రకరకాల చర్చలు నిర్వహించి తమకు వస్తాదంటే తమకు వస్తాదని మాట్లాడుకోవడం గమనార్హం. మరో ప్రక్క రాజకీయాలకు సంబంధించి ఎక్కువ మంది షాపులకు దరఖాస్తు చేసుకోవడం వలన రాజకీయ పలుకుబడి ఏమైనా డ్రాలో పనిచేస్తుందా అని కూడా పలువురు చర్చించుకోవడం స్పష్టంగా కనిపించింది. ఏదేమైనా 2024 శాసనసభ ఎన్నికల ఫలితాల కంటే 2024 నూతన మద్యం షాపుల డ్రా పై ఎంతో ఉత్కంఠ ఎదుర్కొంటున్నామని పలువురు తెలియజేశారు. ఎప్పుడు సోమవారం ఉదయం 8 గంటలు వస్తుందా అని ఎదురుచూస్తున్నట్లు వారు తెలిపారు. పారదర్శకంగా మద్యం షాపుల డ్రా జరగాలని అన్ని వర్గాల వారు కోరుకోవడం కోసమెరుపు.

రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో 300 మందికి వైద్య సేవలు

విశాలాంధ్ర-దేవీపట్నం : శ్రీ రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రీ వారి అధ్వర్యంలో లో రంపచోడవరం శివారు సిరిగిందల పాడులో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందినట్టు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఏజన్సీలో గిరిజనుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎన్నో ఏండ్లుగా రామకృష్ణ మిషన్ విశేష సేవలు అందిస్తుందని పలువురు కొనియాడారు. డా. టి.వి.సుబ్బరావు డా.దాసరి ఉమమహేష్. డా.రాయుడు శ్రీనివాస్. డా.సంపత్ కుమార్ పాల్గొని సుమారు 300మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. అవసరం అయిన 53మందికి రక్తపరీక్షలు, 07మందికి థైరాయిడ్ పరీక్షలు, 10మందికి ఫిజియథెరపీ లు చేసినట్లు స్వామీజి తెలిపారు. మరియు పరమహంస యోగానంద నేత్రలయం వేమగిరి వారిచే కంటి వైద్యశిబిరం నిర్వహించారన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో 65మందికి కంటి పరీక్షలుచేసి 16మందికి కళ్లజోళ్లు అందించారు. కంటి ఆపరేషన్ నిమిత్తం అయిదుగురిని, పరమహంస యోగానంద ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ సూచించారు. ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటిబాబు, వాలంటీర్స్ దాసరి పెద్ద అప్పారావు, అయినం పూడి సూర్య వర్మ మరియు సిబ్బంది పాల్గొన్నారు, రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.

మన్యంలో పర్యాటకుల సందడి

విశాలాంధ్ర-సీతంపేట : మన్యంలో పర్యాటకులు దసరా మరియు సండే సందర్భంగా ఆడలీ వ్యూ పాయింట్, ఎన్టీఆర్ పార్క్, మెట్టుగుడ జలపాతం, సన్నపు గేడ్డ జలపాతం, బెన్నరాయి జలపాతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. మైదాన ప్రాంతాల నుండి పర్యాటకులు అధిక సంఖ్యలో మన్యం ప్రాంతంలో పర్యటించి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ జలపాతాల వద్ద జలకాలాడుతూ సందడి చేశారు. ఎన్టీఆర్ పార్కులో బోట్ షికార్, ఏటిఆర్ వెహికల్ రైడింగ్, చిన్న పిల్లలు ఆటపాటలతో సందడి చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో పర్యాటకులకు మరిన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులకు అందుబాటులో టూరిజం ప్రాజెక్టులు రానున్నాయని ఈ అభివృద్ధి కోసం ఐటిడిఏ కృషి చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

సేంద్రీయ సాగు ఆరోగ్యదాయకం

వ్యవసాయ సహాయ సంచాలకురాలు జాహ్నవి

విశాలాంధ్ర-చింతపల్లి : రసాయన ఎరువుల వాడకాన్ని మానుకుని సేంద్రీయ సాగు ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యాలు బాగుపడతాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కే.జాహ్నవి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలంలో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. దీనివలన ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. సేంద్రీయ పద్ధతిలో సాగు చేసే ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందన్నారు. మైదాస ప్రాంతాలతో పోల్చి చూస్తే మన్య ప్రాంతంలో సేంద్రీయ సాగు విధానం ఉందన్నారు. సేంద్రియ పద్ధతులలో సాగు చేసే చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యాలు బాగుపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. గిరి రైతులు పూర్వపు విధానాలను కొనసాగించాలని ఆమె సూచించారు.